ఈవారం కథ

ప్రయత్న

వింటోంది వింటోంది వింటోంది. వినడానికే శేషజీవితమంతా కేటాయించినంత నిర్వేదంగా వింటోంది రిపోర్టరు నీరజ. కళ్లెగరేస్తూ, నాలుక చప్పరిస్తూ, చేతులు విసురుతూ కాలు తాటిస్తూ 'స్త్రీల మోడెస్టీని రక్షించడం ఎలా'గో ఇంటర్వ్యూ యిస్తున్నాడు అడ్వకేటు సుత్తి సుబ్బారావు

..... ఉదాహరణకి నీమీద నేను అత్యాచారం చేశాననుకో నిన్ను రక్షించడానికి ఉద్దేశించిన యాక్టు పేరు....'' వినిపించలేదు నీరజకు

ఆంగికాభినయంలో సుబ్బారావు విసిరిన కుడి చెయ్యి అసలే జలుబుచేసి రుమాలు వత్తిడికి ఎర్రగా వాచిపోయివున్న నీరజ ముక్కుమీద బలంగా తగిలింది. గాలాగినట్టయింది కాసేపు.

అక్షరం ముక్క రాలక ఎప్పట్నించో తెల్లబోయి వున్న పాకెట్ నోట్సులో 'ఛీ' అని రాసింది అప్రయత్నంగా.

సుబ్బారావుకి ఆడవాళ్లమీద జరుగుతున్న అఘాయిత్యాల్ని వివరిస్తున్నకొద్దీ ఉద్రిక్తత పెరిగిపోతోంది. ఉద్రిక్తత పెరిగినప్పుడల్లా కాలు జాడించడం అలవాటులా వుంది. వచ్చిన అరగంటలో మూడుసార్లు కాలు జాడించి ఒకసారి మాత్రమే 'సారీ' చెప్పాడు సుబ్బారావు. నీరజ తన కాళ్ళు కుర్చీకిందికి విరిచేసుకున్నంత ఇబ్బందిగా కూచుంది. పద్మాసనం వేసుకుంటే వయమేమో అని కూడా అనుకుంది. కానీ అవసరం వస్తే పారిపోవడం లేటవుతుందేమో అనే ఆలోచనతో అది విరమించుకుంది.

"... అది కాదమ్మా ఇప్పుడు నువ్వున్నావనుకో ..." వుండక ఛస్తావా నా ఉద్యోగమే ఇలా ఏడిసింది అనుకుంది కసిగా నీరజ.

"రౌడీలు నీమీద అఘాయిత్యం చేశారనుకో. ఆ మనుషుల్ని నువు గుర్తించగలవా? పోలీస్టేషన్లో కేసు పెడతావు. వాళ్ళు పట్టించుకోరు. పైగా నువ్వే వాళ్ళని పిలిచావంటూ అవమానిస్తారు. అసలిలాటివి చెప్పుకోడమే ఓ కష్టం. పరువు బాధ ఒకటుంది కదా. అప్పుడు కోర్టులు పట్టించుకోవాలి. అసలు ఆడవాళ్ళలో కూడా అన్యాయం గురించి చెప్పుకోవాలనే పట్టుదల ఒకో వయసులో ఒకోలా వుంటుంది. నలభై ఏళ్ళొచ్చి దాదాపు వయసంతా అయిపోయి ఏదో ఏవరేజిగా... సారీ నువ్వంటే నువ్వు కాదు. అర్థం అవడం కోసం ఇలా చెప్తున్నాను. నువ్వుగనక నీమీద జరిగిన అన్యాయం రిపోర్టు చేస్తే వున్న రియాక్షనుకీ పదహారేళ్ళ పిల్ల ... అదిగో అలాంటి పిల్ల (అప్పుడే టీ తెచ్చిన పనిపిల్ల అయోమయంగా చూసింది) అది రిపోర్టు చేస్తే జనం చూసే దృష్టి వేరు.

ముప్ఫయ్యేనిమిదేళ్ళ నీరజకి హటాత్తుగా వార్ధక్యం ముంచుకొచ్చినట్టయి పండుటాకులా వొణికింది. తన వార్ధక్యాన్ని ఇంకొకడు గుర్తించాడనే దుఃఖంలో అత్యాచారపు దుఃఖం కూడా కలిసిపోయి గొంతు పూడుకుపోయినట్టయింది.

"రాస్కో అమ్మా రాస్కో. నే చెప్పిందంతా రాస్కో. సింపుల్‌గా ఇలా నీ చెయ్యి నిమిరినా అది తప్పే" నీరజ ఎడమచెయ్యి నిమిరాడు సుబ్బారావు.

"ఈ చర్యని ఏ యాక్టుకిందికి తేవాలంటారు" చివాల్న నోరు తెరిచి అడిగింది నీరజ.

"ముందు విషయం చెప్పనివ్వరా చిట్టితల్లీ ..." అడగబోయిన విషయం తెలిసినట్టే జాగ్రత్తపడ్డాడు సుబ్బారావు.

నీరజకి తెల్లబోవడానిక్కూడా టైము చాలడం లేదు.

ఆడదాని బతుకుని కుక్కలుచింపిన విస్తరి చేసినవాళ్ళని ఉరేసినా తప్పులేదు"

నీరజకి కడుపులో గిరగిరా తిప్పినట్టయింది. "కుక్కలు నిమిరిన ఎడమచెయ్యిలా వుంటుందో తెలుసుగానీండి. కుక్కలు చింపిన విస్తరి అంటున్నారే అదేమిటి? ఈ పోలిక మీరు చదివిన లా కోర్సులో ఎక్కడైనా వుందా అహహ నాక్కూడా తెలీక అడుగుతున్నా" సూటిగానే అడిగింది పాపం నీరజ.

"భలేదానివే. హహహహ ... భలేగా కనిపెట్టావు. హహహ గడుసుపిండానివే మొత్తానికి... హహ హబ్బ నవ్వొస్తోంది సుమా. అసలీ విషయానిక్కూడా నువు రియాక్టు కాకపోతే నీవు పగలకొడదామనుకున్నా. అంత కోపం వస్తుంది నాకు. అదేమిటలా చూస్తావు, నీమీద నాకున్న గౌరవం అలాంటిది. నీలాంటి గడుసుపిండాలు ఒక్క పదిమందుంటే ఈ స్త్రీల బాధలిలా వుండవు కదా. అసలు మా యావిడకు ఎప్పుడూ చెబుతుంటాను. ఒసే పిచ్చి మొహమా నీ వొంటిమీద ఎవరేనా చెయ్యేస్తే చెప్పు దోమని వలిపినట్టు వలిపేస్తా"

"మీ ఇంట్లో దోమలెక్కువాండీ" అంది నీరజ ఆసక్తిగా ప్రతిరోజూ అతన్ని కుట్టి చంపుతున్న దోమలమీదా తద్వారా అవి చేస్తున్న దేశసేవమీదా బోలెడంత ముచ్చటేసి.

"అసలు శీలమంటే ఏమిటమ్మా. అంతా వట్టిదే. భార్యాభర్తలు చేసేది సంసారమూ నువ్వూ నేనూ చేస్తే ఇంకోటీ అవుతుందా"

నీరజకి మెదడువాపువ్యాధి ఎలా మొదలవుతుందో అనుభవంలోకొస్తోంది.

"అసలు నీకు తెలుసా బార్బేరియన్ బానిస స్త్రీలకి చేస్టిటీ బెల్ట్ బిగించేవార్ట శీల రక్షణ కోసం. అప్పుడా స్త్రీలంతా కలిసి మారు తాళాలు కనిపెట్టార్ట. ఆదీ చైతన్యం అంటే. ఆవిడా నీలాంటి గడుసుపిండమే అయ్యుంటుంది. హహహహ హహహహ" నవ్వుతున్నాడు సుబ్బారావు.

"కిచ కిచ కిచ కిచ" రన్నింగ్ వోట్స్‌నిండా రాస్తూ కూచుంది నీరజ ఆ మొహాన్ని చూడ్డం ఇష్టం లేక.

"రావాలమ్మా రావాలి" రెండు చేతులూ చాచి ఆహ్వానించడం మొదలెట్టాడు సుబ్బారావు.

ఎత్తుకుంటానంటాడా ఏమిటని కంగారుగా చూసింది నీరజ.

ఎవరో ముగ్గురాడవాళ్ళు భక్తిగా నమస్కారాలు చేస్తూ వచ్చి కూచున్నారు.

"ఇదిగోనమ్మా వీళ్ళంతా షూటింగ్ కోసం వచ్చారు. 'భార్యాభర్తలు-పిల్లలు' అనే విషయం గురించి వీళ్ళందరితో మాట్లాడిద్దామనుకుంటున్నా. వీళ్ళంతా ఇళ్ళలో వుండిపోవడం నాకిష్టంలేదు. రావాలి. మీరంతా బైటికొచ్చి మీ హక్కులకోసం చెలరేగిపోవాలి" పరిచయం చేశాడు సుబ్బారావు. మళ్ళీ చేతులు ఝాడిస్తాడేమోనని ముక్కుకి రుమాలు అడ్డం పెట్టుకుంది నీరజ.

"ఏం తల్లీ నేను చెప్పినట్టు కలర్‌ఫుల్ చీరల్లో వస్తావా రావా అనడుగుతా" కూచున్నవాళ్ళలో ఒక అందమైన ఇల్లాల్ని ఎంచుకుని ఆ ప్రశ్న అడిగాడు సుబ్బారావు.

ఆవిడక్కొంచెం కంగారుపుట్టి కాళ్ళు వొణికాయి. అప్రయత్నంగా కొంగుకప్పుకుని వేలచూపులు చూస్తూ చెప్పింది.

"ఔను అదీ సమస్యే అలా అడిగేవాళ్ళూ వుంటారు" అని ఒప్పుకుంది ఎలాగోలా.

"చూడమ్మా నేను నీ భర్తనే కావచ్చు. అంతమాత్రాన కిరసనాయిలుపోసి నిప్పంటిస్తే వూరుకుంటావా? నీకు బ్రతికే హక్కు లేదూ" ఇంకో ఆవిడ్ని అడిగాడు.

ఆవిడ చావుభయంతో ఓసారి జనాలవంక, ఇంకోసారి గోడకి వున్న వెంకటేశ్వరుడి పటంవంక చూస్తూ వూరుకుంది.

"మాట్లాడవేంటమ్మా కిరసనాయిలు పోసి ఎవరు మనకి నిప్పంటించినా కావలించుకోవాలి. మనం బతకనప్పుడు వస్తెందుకు బతకనివ్వాలి" ఆవేశపడిపోయాడు సుబ్బారావు.

కావలించుకోడం ఎలాగో కూడా చూపిస్తాడేమోనని ప్రాణంతోఝాచున్నారంతా. సుబ్బారావు ఎందుకో అందర్నీ కనికరించి తన పొట్టని తనే కావిలించుకుని స్థిమితపడ్డాడు.

"ఇదిగో ఈ పిల్ల నాకు పుట్టలేదంటాను. ఇది నాకే పుట్టిందని నమ్మకమేమిటి అంటే ఏం చేస్తావు నువ్వు" ఏడాది చంటిపిల్లతో నహ స్టూడియోకొచ్చిన ఇంకో ఆవిడ్ని అడిగాడు.

ఆవిడ ఇందాకటి ఇద్దరికంటే కాస్త గుండెధైర్యం కలది కాబట్టి తొందరగానే తేరుకుంది. "మీరిప్పుడు చెప్పినటువంటి మొగుడుగారు కనక ఎవరికైనా వుంటే ఆ భార్యగారు తెగేసి చెప్పాలండీ నమ్మకం లేకపోతే పోరా పో అనాలండి. తన బిడ్డని తనే పెంచుకోవాలండి" అంది.

సుబ్బారావుకి ఏరావందం వచ్చేసింది. హమ్మయ్య ఇప్పటికి నిజమైన రియాక్షన్ వచ్చిందమ్మా చేతులు ఝాడించాడు. ఆడాళ్ళంతా వెక్కి వెక్కి వొంగిపోయి శీలాన్ని కాపాడుకున్నారు.

"మీ ఆడాళ్ళంతా వుత్త పెంటిమెంటు పుట్టలమ్మా! ఈ పాతివ్రత్యాలూ మాతృత్వాలూ పోతేగానీ మీ జాతికి విముక్తి రాదు" అన్నాడు వున్నట్టుండి.

ఔనవాలో కాదవాలో తోచనట్టు ఊరుకున్నారు ఆడవాళ్ళు.

"మీ హక్కులు మీరు తెలుసుకోవాలమ్మా. అనవసరంగా పోలీసులు పట్టించుకోడం లేదు, కోర్టులు పట్టించుకోడంలేదు అంటే ఎలాగు. అసలు మిమ్మల్నెవరూ పట్టించుకోకూడదనే నేను చెబుతా, మీరేమైనా అబలలమకున్నారా చదువులు, ఉద్యోగాలు, రిజర్వేషన్లు ఎన్ని సౌకర్యాలొచ్చాయి. ఇప్పుడు కూడా పోనే పో అంటున్నా నా కాళ్ళు పట్టుకుని, నీ జుట్టుపట్టుకుని ఈడ్చినా నా ఇల్లొదిలి పెట్టకుండా నేనే దైవం అనుకుంటూ నేను మీమీద రోజువారి అఘాయిత్యాలు. చేస్తున్నా కూడా పట్టించుకోక నేను నీ పతిని కాబట్టి ... ..." సుబ్బారావుకి మళ్ళీ వురుగు కుట్టింది.

ఎవరికివాళ్ళం నేను కాదు నాతో కాదు నీకే చెప్తున్నాడు నిను అన్నట్టుగా పక్కవాళ్ళకేసి చూస్తూ కూచున్నాం.

వున్నట్టుండి డెడ్‌లైన్ గుర్తొచ్చింది నీరజకి. హటాత్తుగా లేచింది.

"వస్తానండీ ఇంటర్వ్యూ ఇచ్చినందుకు చాలా థాంక్సు" అంది సుబ్బారావుతో ఫార్మల్‌గా.

"అయ్యో అప్పుడేనా తల్లీ నేను చెప్పాల్సినదాంట్లో సగం కూడా చెప్పలేదు" బాధపడ్డాడు సుబ్బారావు.

"నామ్మో" అనుకుంటూ తుపాకీ గుండుకి కూడా దొరకదల్చుకోని దానిలా బైటికొచ్చేసి కనిపించిన ఆటో ఎక్కింది. కొత్తగా వేసిన కంకరోడ్డుమీద కరకర పరిగెడుతోంది ఆటో.

మోడెస్టీ ... మోడెస్టీ ... అని రాతిగొంతుతో అరుస్తున్నట్టుగా వలుగుడుపడుతోంది కంకర. చిటికెనవేలుతోనైనా తాకకుండా ఒకే ఒక్కడు వలుగురు ఆడవాళ్ళకి గంటన్నరసేపు భయానకమైన అత్యాచారం జరిగిపోయిన వికార దుఃఖాన్నెలా కలిగించాడు? ఆశ్చర్యంలో నిలువునా మునిగిపోయింది నీరజ.

"డెడ్‌లైన్ అయిపోయినట్టుంది కదండీ" అడిగింది కొలీగ్.

"ఆఫ్‌కోర్స్ అయిపోయింది నేనిప్పుడున్నది లైఫ్‌లైనేలెండి" అంది నవ్వేసి.

అదేమిటీ అడగబోయింది ఇంకొకావిడ.

ఈసారి నా ఆర్టికల్ ఇదే అంది రిపోర్టింగ్ డైరీ తీసి.

"ఛీ ... ఛీఛీఛీ ... చా ... ఛాఛా ... కిచ కిచ కిచ ... చచ్చావులే పో ... చంపకురా నాయినా ..." అని వుంది.

ఒక్కముక్క కూడా అర్థంకాలేదు సరస్వతికి. "ఏమిటిది చా గుణింతమా" అడిగింది నోరంతా తెరిచి.

"ఇప్పటిదాకా నేనుండి వచ్చిన డెడ్‌లైన్ అదే" అంది పజిల్ ఇస్తున్నట్టు నీరజ.

ఎవరికీ అర్థంకాలేదు.

ఎవరికీ అర్థంకాకుండా కుట్టడంలో ఇంతానందం వుందా? హరి సుబ్బారావూ నీకు తెలీకుండా నిన్ను ఆరు ఖండాలకీ అర్థమయ్యేట్టు ఎలా కుడతానో చూడు శపథం చేసుకుంది నీరజ.



"చూడమ్మా నేను నీభర్తనే కావచ్చు. అంత మాత్రాన కిరసనాయిలు పోసి నిప్పంటిస్తే వూరుకుంటావా? నీకు బ్రతికే హక్కులేదూ''
ఆవిడ చావు భయంతో ఓ సారి జనాలవంక, ఇంకోసారి గోడకి వున్న వెంకటేశ్వరుడి పటం వంక చూస్తూ వూరుకుంది.

వచ్చేవారం కథ
ముక్త
– కుప్పిలి పద్మ